క్లుప్తంగా

ఏడు నామినేషన్ల దాఖలు

భీమునిపట్నం: భీమిలిలో బుధవారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ తరఫున నామినేషన్‌ను ఎన్నికల నిర్వహణ అధికారి ఎస్.భాస్కరరెడ్డికి అందజేశారు. ఆయన భార్య ముత్తంశెట్టి జ్ఞానేశ్వరి వైఎస్సార్ సీపీ తరఫున మరో నామినేషన్ దాఖలు చేశారు. వీరితో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మి పాల్గొన్నారు. అలాగే జై భారత్ నేషనల్ పార్టీ తరఫున ఇల్లిపిల్లి అనిల్‌కుమార్, ప్రజా ప్రస్థానం పార్టీ తరఫున దాసరి లక్ష్మి సంధ్య, సమాజ్‌వాదీ పార్టీ తరఫున చోడుపిల్లి రాజు, ఇండిపెండెంట్లుగా ఏలూరు ధర్మావతి, నొక్కాల సూర్యప్రకాశ్ నామినేషన్లు దాఖలు చేశారు.

128 మందికి ఉద్యోగాలు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ నుంచి వివిధ బీఎస్సీ, ఎమ్మెస్సీ, సీఏ, తదితర కోర్సులు అభ్యసిస్తున్న 128 మంది విద్యార్థులను పలు కంపెనీలు ప్రాంగణ నియామకాల్లో ఎంపిక చేసుకున్నాయని గీతం కెరీర్ ఫుల్‌ఫిల్‌మెంట్ సీనియర్ మేనేజర్ ప్రభా రాజ మహంతి తెలిపారు. ఈ విద్యార్థుల్లో పలువురికి రూ.14.25 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు లభించాయని తెలిపారు.

నేటి నుంచి లక్ష్మీ దేవి ఉత్సవాలు



స్వతంత్రనగర్‌లోని లక్ష్మీదేవి అమ్మవారు

మధురవాడ : జీవీఎంసీ 5, 7 వార్డులు స్వతంత్రనగర్‌లో వెలసిన శ్రీ లక్ష్మీ దేవి అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 25, 26, 27వ తేదీల్లో నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలియజేసింది. ఈ మేరకు బుధవారం ఆలయం వద్ద ఉత్సవ రాట వేశారు. ఏటా మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహణ ఆనవాయితీగా వస్తోంది. ఈ ఉత్సవాలు సందర్భంగా ప్రత్యేక పూజలు, ఆరాధన, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆదివారం మధ్యాహ్నం ఆలయం ఆవరణలో అన్నప్రసాదం పంపిణీ చేస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ప్రతినిధులు కోరారు.

మేనిఫెస్టోలో రైతు రుణమాఫీకి ప్రాధాన్యమివ్వాలి

తగరపువలస: త్వరలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ద్వారా రూపొందించే ఎన్నికల మేనిఫెస్టోలో రైతు రుణమాఫీకి ప్రాధాన్యమివ్వాలని కోరుతూ నగరానికి చెందిన సామాజిక కార్యకర్త జి.అప్పన్న వినతి పత్రం పంపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 65 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వీరంతా నిరుపేదలు, దారిద్ర్యరేఖకు దిగువ వర్గానికి చెందిన వారన్నారు. ప్రస్తుత పరిస్థితులలో పెట్టుబడి ఖర్చులు, వ్యవసాయ పనిముట్లకు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. గత ఐదేళ్లలో రైతులకు రూ.13,500 వంతున రైతు భరోసా రూపంలో సాయం చేశారన్నారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో పెట్టుకుని ఒక్కో రైతుకు రూ.2 లక్షల వంతున రుణమాఫీ అమలయ్యేలా మేనిఫెస్టోలో ప్రకటించాలని కోరారు. తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను నెరవేర్చే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు సీఎం కావాలన్నదే రాష్ట్ర ప్రజల అభిమతమని అప్పన్న తెలిపారు.

ఏయూ విద్యార్థులకు కాగ్నిజెంట్ స్కాలర్‌షిప్

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు కాగ్నిజెంట్ స్కాలర్‌షిప్ సాధించారు. విభాగానికి చెందిన 11 మంది విద్యార్థులు రూ.70 వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి బుధవారం అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, ఆచార్య నాగరాజకుమారిపాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. మరింత సేవ చేస్తా

- సీఎం జగన్ పాలనలోనే ప్రజలందరికీ మేలు
- చంద్రబాబువన్నీ మోసపూరిత హామీలే
- 'గంటా'ను గెలిపిస్తే మళ్లీ ఎవరికీ కనిపించడు
- అభిమానులు, కార్యకర్తల కోలాహలం మధ్య ఉత్సాహంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు నామినేషన్



సంగివలస కొత్తమ్మ తల్లి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



నామినేషన్‌కు ఊరేగింపుగా వెళ్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి

భీమునిపట్నం: ముచ్చటగా మూడోసారి భీమిలి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నానని.. ప్రజలంతా ఓట్లతో ఆశీర్వదిస్తే అందరికీ అందుబాటులో వుంటూ మరింత సేవ చేస్తానని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఎమ్మెల్యేగా బుధవారం నామినేషన్ దాఖలు చేయడానికి ముందు బీచ్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ప్రజలందరికీ గతంలో ఎన్నడూ జరగనంత మేలు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో జరిగిందని... అంతకు మించి అన్ని వర్గాల ప్రజలకూ మేలు జరగాలంటే సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఎన్నికలు పార్టీల పరంగా జరగడం లేదని.., పేదవారికి, పెత్తందారులకు మధ్య జరుగుతున్నాయన్నారు. 2019 ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి పలు హామీలు ఇస్తే, ఆచరణ సాధ్యం కాదని చంద్రబాబు అండ్ బ్యాచ్ ఎద్దేవా చేశారన్నారు. అందుకు భిన్నంగా సీఎం జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కులం, మతం, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ నూటికి నూరు శాతం సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు పలు అభివృద్ధి పనులు కూడా చేపట్టారని కొనియాడారు. చంద్రబాబు పాలనలో ఎవరికీ సంక్షేమ పథకాలు అందలేదని, దోచుకుని... దాచుకోవడానికే అధికారాన్ని ఉపయోగించుకున్నారని ఆరోపించారు. బాబు దోపిడీ పాలనకు, సీఎం జగన్ సంక్షేమ పాలనకు మధ్య తేడాను గమనించాలని కోరారు. పరిపాలన రాజధాని వస్తే విశాఖ నగరం అన్ని రంగాల్లోనూ మరింత అభివృద్ధి చెందుతుందని, ఫలితంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. కరోనా కష్టకాలంలో దేశంలోని అన్ని ప్రాంతాల్లోని ప్రజలు తల్లడిల్లిపోయారని, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకూ అండగా నిలిచారని గుర్తు చేశారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ సేవలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, వీటన్నింటినీ ప్రజలు గుర్తించుకోవాలని కోరారు. ఆ వ్యవస్థలు కొనసాగాలంటే సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని, అందుకు అందరూ మద్దతుగా నిలవాలని కోరారు.

ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నం



వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ ధర్మానికి, అధర్మానికి మధ్య యుద్ధం జరుగుతోందని... ఇందులో ధర్మపాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించే బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. తాను ఈ ప్రాంతానికి స్థానికురాలునని, అందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. చంద్రబాబుకు చెప్పుకోవడానికి ఏమీ లేదని, అందుకే ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రజలంతా గమనించి నిత్యం ప్రజలకు అందుబాటులో వుంటూ మంచి చేసే ముత్తంశెట్టి శ్రీనివాసరావును ఎమ్మెల్యేగా, తనను ఎంపీగా గెలిపించాలని ఆమె కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు మాట్లాడుతూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, చిత్రంలో బొత్స ఝాన్సీలక్ష్మి

భూ ఆక్రమణదారు 'గంటా'కు ఓటు వేయొద్దు

టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ఎలాంటి వారో అందరికీ తెలుసని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆయన గెలిచిన తర్వాత ఎవరికీ అందుబాటులో వుండరన్నారు. అందుకు నిదర్శనమే విశాఖ ఉత్తర నియోజకవర్గమని... 2019లో గెలిచిన తర్వాత అక్కడి ప్రజలకు ఐదేళ్లలో ఒక్కసారి కూడా ముఖం చూపించలేదన్నారు. అదే పరిస్థితి ఇక్కడా పునరావృతం అవుతుందన్నారు. ఎన్నికల్లో గెలిచినా ప్రజా సేవను పక్కన పెట్టేసి... అవినీతి, భూ ఆక్రమణలు, వ్యాపారాలు చేసుకోవడానికే అధికారాన్ని ఉపయోగిస్తారని ఆరోపించారు. అందువల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ గంటాకు ఓటు వేయొద్దని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు.

అప్పన్నను దర్శించుకుని..



సింహగిరిపై కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామిని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. వచ్చే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు పార్టీ అధిష్టానం ఇచ్చిన బీ ఫాంను వరాహ లక్ష్మీనృసింహస్వామికి చూపించి ఆశీస్సులు తీసుకున్నారు. స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.



సభా ప్రాంగణానికి తరలి వస్తున్న అభిమానులు

భీమిలిలో జనసముద్రం

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి నామినేషన్‌కు 45 వేల మందికిపైగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు
- సాంస్కృతిక కార్యక్రమాలతో ఉర్రూతలు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థిగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు నామినేషన్‌ను పురస్కరించుకుని భీమునిపట్నంలో బుధవారం మరో జన సముద్రం సాక్షాత్కరించింది. తగరపువలస, భీమిలి క్రాస్ రోడ్డు, విశాఖ బీచ్‌రోడ్డు... ఇలా ఎటు చూసినా అయిదు కిలోమీటర్ల వరకు ఇసుకేస్తే రాలనంతగా జనం తండోపతండాలుగా భీమునిపట్నంలోకి ప్రవేశించడం కనిపించింది. ఈ నెల 18న జరిగిన గంటా శ్రీనివాసరావు బలప్రదర్శనతో పోలిస్తే మూడు రెట్లు అభిమానులు ముత్తంశెట్టి నామినేషన్‌కు వచ్చారని సాక్షాత్తూ టీడీపీ నాయకులే అంగీకరించారు. పద్మనాభం, ఆనందపురం మండలాల నుంచి 8 వేల వంతున, భీమిలి మండలం నుంచి 10 వేల మంది రాగా జీవీఎంసీ భీమిలి, మధురవాడకు జోన్లకు చెందిన 9 వార్డుల నుంచి 20 వేల పైచిలుకు అభిమానులు తరలివచ్చి సందడి చేశారు. గంటా నామినేషన్ సందర్భంగా పెద్దగా జనం కనిపించక పోవడంతో ద్విచక్ర వాహనాలను భీమిలి టౌన్ లోపలికి అనుమతించగా, ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు వచ్చిన అభిమానులను కంట్రోల్ చేయలేక ద్విచక్ర వాహనాలు, ఆటోలను పట్టణంలోకి అనుమతించలేదు. దీంతో టౌన్ బయటే అభిమానులు, నాయకులు, కార్యకర్తలు వాహనాలను నిలిపి మండుటెండను సైతం లెక్క చేయకుండా నడుచుకుంటూ వడివడిగా బీచ్‌లో జరిగిన సభకు, తర్వాత ఆర్డీవో కార్యాలయం వరకు వచ్చారు.



పద్మనాభంలో ర్యాలీ ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, ఎంపీపీ రాంబాబు

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

భీమిలి నియోజకవర్గం నలుమూలల నుంచి స్వచ్ఛందంగా తరలివచ్చిన అభిమానులను అలరించడానికి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వీటిలో కోలాటం, తప్పెటగుళ్లు, కొమ్ముల వాయిద్యాలు, కాళికా నృత్యం, డప్పు వేషాలు తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సభకు విచ్చేసిన వారికి అసౌకర్యం కలగకుండా షామియానాలు ఏర్పాటు చేయడంతోపాటు మజ్జిగ, మంచినీటి సదుపాయాలు కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రీజినల్ యూత్ కో ఆర్డినేటర్ ముత్తంశెట్టి నందీష్, ఎన్నికల పరిశీలకుడు పి.బాలరాజు, పార్టీ సీఈసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీకాంత్, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, బోని అప్పలనాయుడు, ఎంపీపీలు దంతులూరి వాసురాజు, కె.రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బోని బంగారు నాయుడు, మండల సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, డైరెక్టర్లు తమ్మిన రామలక్ష్మణ, బాడితబోయిన రాములప్పడు, శీరపు అప్పలరెడ్డి, సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీప్రసాద్, కార్పొరేటర్లు దౌలపల్లి ఏడుకొండలు, లొడగల అప్పారావు, కొప్పుల ప్రభావతి, శిల్లా సరళారాణి, కరుణాకరరెడ్డి, అక్కరమాని రామునాయుడు, జీరు వెంకటరెడ్డి, మద్దిల వెంకటరమణ, మండల, జీవీఎంసీ వార్డుల అధ్యక్షులు జగుపల్లి ప్రసాద్, గాడు శ్రీను, చిల్ల భాస్కరరెడ్డి, బంక సత్యం, అల్లిపల్లి నరసింగరావు, పాల రమణ, మజ్జి వెంకటరావు, ఉప్పాడ సూర్రెడ్డి, కోరాడ లక్ష్మణ, మైలపల్లి షణ్ముఖరావు, బొట్ట అప్పలరాజు, పోతిన హనుమంతురావు, గాదె రోశిరెడ్డి, జగన్నాథ సన్యాసిరెడ్డి, జిల్లా అనుబంధ సంఘాల ప్రధాన కార్యదర్శులు డబ్బీరు ప్రశాంతి, బింగి హరికిరణ్‌రెడ్డి, జీవీ రమణ, చిప్పాడ వెంకటేష్, ఉప్పాడ నాగేశ్వరరావు, పాసి స్వర్ణలత, వాసుపల్లి కొండబాబు, తెడ్లాపు అప్పలరాజు, కదిరి ఎల్లాజీ, సుజాత రెడ్డి, ముదుండి రాజేశ్వరి, వంశీరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు నమ్మి లక్ష్మణ, రాంభుక్త ప్రభాకర్ నాయుడు, చిల్ల ప్రమీల, కర్రోతు నాగేంద్ర, గౌరినాయుడు, కోండ్రు రామసూరప్పడు, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, డింగి దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో ర్యాలీగా వస్తున్న అభిమానులు



కోలాటం కళాకారుల ప్రదర్శన

పద్మనాభం నుంచి 7 వేల మంది ర్యాలీ

పద్మనాభం: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు నామినేషన్‌కు పద్మనాభం మండలం నుంచి మండుటెండను సైతం లెక్క చేయకుండా ఏడు వేల మంది ర్యాలీగా బుధవారం భీమునిపట్నం తరలివెళ్లారు. పద్మనాభం జంక్షన్‌లో ఈ ర్యాలీని జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు ప్రారంభించారు. బైక్‌లు, ఆటోలు, కార్లుతో ర్యాలీగా తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ నాయకులు బుగత సత్యనారాయణ, సిరుగుడి ఆదినారాయణ, తాలాడ పద్మనాభం, ఈర్ల ఈశ్వరరావు, బుగత శ్రీనివాసరావు, బేపల గురునాయుడు, మరగడ అప్పారావు, పల్లి మహేష్, సుంకర నారాయణరావు, బొలె అప్పలనాయుడు, గాడు అప్పలరాజు, తాలాడ నరసింహనాయుడు, గంగిరెడ్ల పద్మనాభస్వామి పాల్గొన్నారు.



భీమిలిలో కాళికా నృత్యం, డప్పుల వేషాలు



కొమ్ముల వాయిద్య కళాకారులు



తప్పెటగుళ్లు, చిడతల కళాకారులు



తగరపువలస నుంచి భీమిలి రోడ్డులో 5 కిలోమీటర్ల మేర అభిమానుల ర్యాలీ

గీతంతో ఇండియన్ నేవీ ఒప్పందం



అవగాహన ఒప్పందం చేసుకున్న ఇండియన్ నేవీ అధికారులు, గీతం ప్రతినిధులు

కొమ్మాది: అగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీలో పరిశోధన, అభివృద్ధిపై ఇండియన్ నేవీ, గీతం యూనివర్సిటీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఐఎన్ఎస్ కళింగ, గీతం విశ్వవిద్యాలయం సాంకేతిక ఆవిష్కరణలు అభివృద్ధి చేయడం, భద్రతను పెంపొందించడం లక్ష్యంగా సహకరించడానికి అవగాహనకు వచ్చాయి. ఐఎన్ఎస్ కళింగ కమాండింగ్ ఆఫీసర్ ప్రదీప్ పటేల్, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ సహకార ప్రాజెక్టు శిక్షణ కోసం అగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీలో పరిశోధన, అభివృద్ధి కోసం డ్రోన్ టెక్నాలజీ, స్మార్ట్ సిటీ ప్రాజెక్టు, పవర్ ఫ్యాక్టర్ మేనేజ్‌మెంట్, సివిల్ ఇంజినీర్ నిర్మాణాల కోసం నాన్ – డిస్ట్రక్టివ్ టెక్నిక్, మొదలైన వాటిపై దృష్టి పెడుతున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న భక్తి సంగీత స్వరార్చన

సీతమ్మధార: సీతమ్మధార గురువాయురప్పన్ శ్రీకృష్ణ మందిరంలో బుధవారం వైదిక విజ్ఞాన విపంచి వ్యవస్థాపకులు భానుప్రసాద్, ఉమామహేశ్వరి దంపతుల సారథ్యంలో పి.రంగనాథ ఆచార్యులు బృందం సీతారామ కల్యాణం, శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించింది. శ్రీరామచంద్ర స్వామి వారి ఊంజల్ సేవలో భాగంగా నగరానికి చెందిన శృతిలయ సాంస్కృతిక భక్తి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత స్వరార్చన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో మెలోడి సంస్థ కార్యదర్శి సిహెచ్.సత్యనారాయణ, కొణతాల రాజు, ఫణి స్వామి, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ



అద్దాల అలంకరణలో సంతపేట కొత్తమ్మతల్లి



తులసిమాలలు, బంతిపూల అలంకరణలో రాస పోలమాంబ

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు సంతోపేట కొత్తమ్మతల్లిని అద్దాలతో అలంకరించారు. సంతోపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ అలంకరణకు ఆలయ కమిటీ ప్రతినిధులు చేట్ల త్రినాథ రెడ్డి, పిట్ట వెంకటరావు, నందిక రమణ ఆర్థిక సహకారం అందించారు. అమ్మవారి అలంకరణను భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు, సంతపేటకు చెందిన దుంప శంకరరావు పూర్తి చేశారు. భీమిలి మండలం మజ్జివలసకు చెందిన రాస పోలమాంబ అమ్మవారిని తులసిమాలలు, బంతిపువ్వులతో అలంకరించారు. ఈ అలంకరణకు కృష్ణంరాజుపేటకు చెందిన తుపాకుల నరసింగరావు, మణమ్మ దంపతులు సహకరించారు. అలాగే భక్తులకు ప్రసాదాలను వీరితోపాటు తుపాకుల అప్పలరాసయ్య, రాసమ్మ దంపతులు అందించారు.

మాజీ సైనికులకు 'దివీస్' సామాజిక భవనం

రూ.18.29 లక్షలతో నిర్మించిన యాజమాన్యం

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడలో దివీస్ లేబొరేటరీ మాజీ సైనికుల కోసం రూ.18.29 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని బుధవారం సంస్థ జీఎం వైఎస్ కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సైనికులు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జీఎం ఎం.ఎస్.ఎన్.రావు, సంఘం అధ్యక్షుడు సూరిబాబు, ఉపాధ్యక్షుడు రమణారావు, సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, కె.నరసింహారావు, ఎస్.కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.



సామాజిక భవనం వద్ద దివీస్ ప్రతినిధులతో మాజీ సైనికులు

28న వేపాకులతో భువనేశ్వరీదేవికి అధివాసం



భువనేశ్వరి అమ్మవారు

దాబాగార్డెన్స్ : విశాఖ జిల్లా ఆరిపాక పంచాయతీ, సబ్బవరంలో వెలసిన భువనేశ్వరీదేవికి ఈ నెల 28న వేపాకులతో అధివాస మహోత్సవం నిర్వహించనున్నట్టు అమ్మవారి ఆరాధన పీఠం నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. పీఠంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న నిర్వహించనున్న అధివాస మహోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి రావాలని కోరారు.

టీడీపీ, జనసేన కొట్లాటలో ఇద్దరిపై కేసు

మధురవాడ: టీడీపీ అభ్యర్థుల ర్యాలీలో మధురవాడలో టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య జరిగిన కొట్లాటలో ఓ జనసేన నాయకుడు సహా మరి కొందరిపై పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం సాయంత్రం జీవీఎంసీ 6 వార్డులో భీమిలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి భరత్ ఎన్నికల ప్రచారం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పీఎంపాలెం వద్దనున్న శిల్పారామం జాతర నుంచి దుర్గాలమ్మ గుడి, మధురవాడ అప్ బ్రిడ్జి మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా ర్యాలీ దుర్గాలమ్మ గుడి దగ్గరకి వచ్చేసరికి టీడీపీ, జనసేన కార్యకర్తల ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ నేపథ్యంలో తలెత్తిన వివాదం గొడవగా మారి ఇరు పార్టీలకు చెందిన వారు జెండా కర్రలతో కొట్టుకునే స్థాయికి వెళ్లింది. ఈ కొట్లాటలో టీడీపీకి చెందిన పీస చిన్నారావు అనే వ్యక్తికి కంటిపై గాయమైంది. దీంతో ఆయన పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేసి బుధవారం సాయంత్రం జనసేన జీవీఎంసీ 6వ వార్డు అధ్యక్షుడు సంతోష్‌నాయుడు, ఈశ్వరరావు, మరికొందరిపై కేసు నమోదు చేశారు.